
# పరువు



-పి.ఎస్.నారాయణ

**'అడ్డగాడిద చచ్చి కూడా మన్ని పీక్కు తింటున్నాడేమిత్రా... ఎవడి జేబులోనైనా పది రూపాయలుంటే ఓ గెమాక్సిన్ పాకెట్ పట్టుకురండి... చీమలు వరస కట్టినయ్యంటే నలుగురూ నవ్విపోతారు!' అన్నడు సాంబశివుడు గారపట్టిన పళ్ళన్నీ బయట పెట్టి నవ్వుతూ.**

జయరాం చికాగ్గా చూశాడు అతడి మాటలకు. మూర్తి ఏదో ఆలోచిస్తూ ఓ పక్కగా కూర్చున్నాడు. రామారావు బాత్‌రూంలో ముఖం కడుగుతున్నాడు.

వాళ్లంతా ఒకచోట పనిచేస్తున్న వాళ్లు. మిత్రులు. ప్రతి వాళ్లూ వాళ్లను చూస్తూనే పంచ పాండవులు వస్తున్నారని అనుకోవటం - మరు క్షణంలోనే ఈ నికృష్టులను అంత మంచి వాళ్లతో పోల్చుటమా - అన్నట్లుగా చెంపలు వాయించుకోవడమూ అలవాటయిపోయింది ఆ కాలనీలో.

శ్రీనివాసును భరించలేక అతడి భార్య ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్ళిపోతే వాడి ఇల్లే వాళ్లకు అడ్డా అయింది. అక్కడే తాగుతారు. అక్కడే పేకాడతారు. అక్కడే తందనాలాడుతుంటారు.

కాలనీ సెక్రటరీ ఒకసారి వాళ్లకు వార్నింగ్ ఇచ్చాడు కూడా - ఆ వెధవల నోళ్లలో నోరు పెట్టటం ఇష్టంలేక ఎవరూ వత్తాసు రాకపోవటంతో ఆయనా మెదలకుండా ఊరుకుండిపోయాడు.

ఆ శ్రీనివాసే రాత్రి పన్నెండు గంటలప్పుడు తాగుతూ చచ్చాడు. వెంటనే వాడి పెళ్ళానికి ఫోను చేస్తే - బయల్దేరుతున్నట్లుగా చెప్పటంతో శవాన్ని కాపలా కాస్తూ కూర్చున్నారు ఆ నలుగురూ.

'ఆవిడగారు తెల్లవారుఝామున గుంటూరులో పల్నాడుకు బయల్దేరినా ఇంటికి వచ్చేటప్పటికి పదకొండు గంటలవుతుంది. అదీ రైలు సరిగ్గా వస్తే. శవాన్ని ఇంట్లో నుంచి బయటకు పంపటానికి ఏ సాయంత్రమో అవ్వవచ్చు. ఆమె రావాలి. కాస్తో, కూస్తో డబ్బు తేవాలి. అంత్యక్రియల కార్యక్రమానికి బ్రాహ్మణ్ణి మాట్లాడాలి. ఆయన గారెంత అడుగుతారు. ఆపైన స్మశానంలో ఖర్చులు. తీసుకువెళ్ళటానికి లారీకి బాడుగ... అన్నీ కలిపి తడిసి మోపెడవుతాయి' - మిత్రులందరి మనస్సుల్లోనూ అవే ఆలోచనలు.

మొగుడంటే అసహ్యం పుట్టి పుట్టింటికి వెళ్ళిపోయిన భార్య ఆయన పోతే అక్కడి నుంచి అంత డబ్బు తెచ్చి ఖర్చు పెడుతుందా అనేది వాళ్ల సందేహం కూడా.

సాంబశివుడే అన్నాడు. 'నాకు అయిడియా వచ్చింది గురూ! వీడి భార్య వచ్చేలోగా మనం ఇక్కడ అన్ని ఏర్పాట్లూ చేస్తే - ఆవిడ రాగానే వీడిని మనం లేపేయవచ్చు!'

'బాగానే ఉంటుంది - కాని డబ్బు!' అన్నాడు మూర్తి.

జయరాం కళ్లు చిట్లించాడు. 'మంచో చెడో... అయిదుగురం ఇన్నాళ్లూ కలిసికట్టుగా తిరిగాం... వాడు పోయాడు... మన నలుగురుమే తలా ఒక చేయి వేస్తే బాగుంటుందేమోనని అనుకుంటున్నాను!' అతడికి డబ్బు అంత ఇబ్బందికరమైన విషయం కాదు... ఎన్ని వెధవ ఖర్చులు పెట్టినా అవసరానికి తన ఊళ్ళో ఇంటికి వెళ్ళి బ్రతిమలాడి, భంగపడు జేబు నింపుకు రాగల శక్తిమంతుడు.

'నా వల్ల కాదురా బాబు! ఇప్పటికే వాడు నాకు రెండు వేలు బాకీ వున్నాడు... దాన్ని ఎవడి దగ్గర ఎలా వసూలు చేసుకోవాలో అర్థంగాక బుర్ర పగిలిపోతోంది!' సాంబశివుడు నసగటం మొదలుపెట్టాడు.

'సాంబిగా! అందులో అసలెంత... వడ్డీ ఎంతరా?' బాత్‌రూంలో నుంచే పెద్దగా అరిచాడు రామారావు.

కోపంగా చూచాడు ఆ ప్రశ్న బయటకు వచ్చిన బాత్‌రూం వంక సాంబశివుడు.

'అందరి దగ్గరా అయిదు రూపాయల లెక్కన తీసుకుంటుంటే... వీడింట్లో మనని ఆడుకోనిస్తున్నాడు గదా అని మూడే తీసుకుంటున్నాను - తెలుసా!'

'నేను అడిగిందానికి సమాధానం చెప్పి ఏడ్వరా!' మళ్ళీ బాత్‌రూంలో నుంచే కేక వినబడింది.

మూర్తి కల్పించుకున్నాడు. 'అవన్నీ ఎందుకుగాని... ఇప్పుడు ఏం చేస్తే బాగుంటుందో ఆలోచించండి!'

సాంబశివుడు లేచి మూర్తి దగ్గరకు వెళ్ళి ఎదురుగ్గా కూర్చుంటూ, 'నేనో మాటంటాను... మీరు సరే అంటే సరే...' అన్నాడు.

'చెప్పూ!'

'మనం ఈ కాలనీలో పదేళ్ళ బట్టీ ఉంటున్నాం... ఎక్కువమంది మనకు తెలుసు... నలుగురం నాలుగువైపులా చందాలకు బయల్దేరితే ఇక ఏ గొడవా ఉండదు... ఆపైన అందులో ఎంత మిగిలినా అంతే నా అదృష్టం అనుకుంటూ నా బాకీ కింద చెల్లేసుకుంటాను!'

'అసలు ఎవడైనా మన మొఖం చూసి డబ్బిస్తాడంటావా?' రామారావు బాత్‌రూంలో నుంచి బయటకు వచ్చి అక్కడ తలుపు మీద వున్న మడ్డి పట్టిన తువ్వాలుతో మొఖం తుడుచుకుంటూ అన్నాడు.

'చావు... శవం... ఇంత బాధలో వున్నప్పుడు ఎవడు మాత్రం కాదంటాడురా! రేపు ఎవడికి ఎలాంటి చావు మూడిందో ఎవడికి తెలుసు... అవసరమైతే అప్పుడు మనమూ ఓ చేయి వేస్తాం!' సాంబశివుడు అన్నాడు. అతడికి ఎట్లాగైనా తన రెండు వేలు దక్కించుకోవాలని మనస్సు తహతహలాడుతోంది. వెధవది - ఈ ఛాన్సు పోతే మరోటి రాదు!

జయరాం అన్నాడు. 'శ్రీనివాసు భార్య ఏమైనా తెస్తుందేమో చూద్దాం... అంతగా కాస్త తక్కువయితే మనమే సర్దుదాం!'

'అసలే నా డబ్బు పోయిందని నేనేడుస్తుంటే - మనం సర్దుదాం. మనం సర్దుదాం అంటావేమిటి... నేనిక పైసా ఖర్చు పెట్టను రా- నన్ను ఈడ్చి తన్నిన రూపాయి రాలదు!' అంటూనే విసురుగా లేని నిలబడ్డాడు మూర్తి ముందు నుంచి సాంబశివుడు.

'ఊరికే ఆవేశపడబోకు... ఎవరి దగ్గర మాత్రం వున్నాయి... ఆమెను రానీయండి... ఆమె వట్టి చేతులతో వచ్చినా ఆమెను సంప్రదించి చేస్తేనే ఏదైనా బాగుంటుంది' అన్నాడు మూర్తి అనునయంగా.

అప్పుడు ఎనిమిది గంటలయింది. ఎండాకాలం ఎండ చురుక్కుమంటోంది.

'ముందు నేనూ జయరాం వెళ్ళి కాసిని టీ తాగి వస్తాం. మేం వచ్చింతరువాత మీరిద్దరూ వెళ్ళురుగాని!' అన్నాడు.

సాంబశివుడు ఆ ఇంట్లో నుంచి బయటకు వస్తూ, 'గెమాక్సిన్ మేం తెస్తాంలే!'

జయరాం బయటకు వచ్చాడు.

నాలుగడుగులు వేసింతరువాత, 'నా భయం ఏం లేదు గురూ... నా భార్యను నేను ప్రతి పైసా పైసా లెక్కచెప్పాలి... వడ్డీలు గట్రా అన్నీ తనే లెక్క వేస్తుంది... అసలు మూడు రూపాయలకు దాన్ని ఇప్పించేటప్పటికే నా తల ప్రాణం తోకకు వచ్చింది అనుకో!' అన్నాడు సాంబశివుడు - ఎలాగైనా తన మాటకు వత్తాసుగా అతడిని తన వైపునకు తిప్పుకోవాలని - సగం అబద్ధాలు, సగం నిజాలు ఏడుపు కంఠంతో చెప్పాడు. మూర్తిని తేలిగ్గా ఒప్పించవచ్చు. ఇక రామారావా - నోటి దూల ఎక్కువ... ఊరికినే తిడతాడు... కానీ నలుగురిలో ముగ్గురు ఒకటైతే వాడే నోర్మూసుకుంటాడు - అనుకున్నాడు మనస్సులోనే సాంబశివుడు.

జయరాం వింటున్నాడు గాని మాట్లాడటంలేదు.

'ఏమంటావ్... ఏమంటావ్!' అంటూ ప్రతి రెండు నిమిషాలకూ అంటున్నా 'చూద్దాంలే... చూద్దాంలే' అంటూ మాట తప్పిస్తున్నాడు. అతడికి సాంబశివుడి సంగతి తెలిసిందే. చచ్చి గీ పెట్టినా ఎవ్వరికీ పైసా ఊరికినే ఇవ్వడు!

ఇద్దరూ వెళ్ళి కాలనీ గేటు ఎదురుగ్గా ఉన్న హోటల్లో టీ తాగారు. జయరాం ఇరవై రూపాయల నోటు తీసి ఇచ్చాడు టీ తెచ్చిన కుర్రాడికి.

అతడు మిగతా డబ్బులిస్తుండగానే సాంబశివుడు ఆ కుర్రాడి చేతిలో నుంచి డబ్బులు లాక్కొని, 'పోతూ పోతూ ఓ గెమాక్సిన్ పాకెట్ కొందాం!' అన్నాడు.

జయరాం మాట్లాడలేదు. ఇద్దరూ లేచి బయటకు వచ్చారు. సాంబశివుడికి జయరాం డబ్బులతో పాన్ వేసుకోవాలనిపించింది గాని - తాంబూల చర్వణం చేసి శవం పక్కన కూర్చుంటే నలుగురూ నవ్విపోతారేమోనని నిగ్రహించుకున్నాడు. గెమాక్సిన్ కొని మిగిలిన డబ్బులు జయరాంకు ఇచ్చాడు.

ఇద్దరూ శవం వున్న ఇంటి దగ్గరకు వచ్చారు.

'నేను చెప్పింది గుర్తుంచుకో గురూ!' అన్నాడు సాంబశివుడు జయరాం చేయి పట్టుకుని మరోసారి.

వాళ్ళు లోపల కాలు పెట్టేటప్పటికే ఆ కాలనీ వాళ్ల నలుగురు శ్రీనివాసు శవాన్ని చూడటానికి వచ్చి వున్నారు.

'నిన్నంతా బాగానే ఉన్నాడు. అర్ధరాత్రి దాకా కబుర్లు చెప్పుకుంటూ కూర్చునే ఉన్నాం... ఉన్నట్లుండి గుండెల్లో నొప్పి అన్నాడు... ఒళ్లంతా చెమటలు పట్టింది... గుడ్లు తేలేశాడు. డాక్టరు వచ్చి మందులిచ్చే అవకాశమే లేకుండా పోయింది. అప్పటికీ అంత అర్ధరాత్రి పూట రామబ్రహ్మం గారిని నిద్రలేపి తీసుకువచ్చాం... ఆయన చేయి పట్టుకుంటూనే - అయిపోయింది గదా అన్నాడు!' సాంబశివుడు కంట తడి పెట్టుకుంటున్నట్లుగా జేబు రూమాలుతో కళ్లు అద్దుకుంటూ అన్నాడు.

వచ్చిన వాళ్ళూ మాట్లాడలేదు. ఒకసారి శవం వంక... దాని చుట్టూ కూర్చున్న నలుగురి వంకా చూసి ఓ నిట్టూర్పు విడిచి వెళ్ళిపోయారు.

వాళ్లు నోరు మెదపకుండా వెళుతుంటే సాంబశివుడికి తిక్కరేగింది. 'వెధవలు... ఏం చూద్దామని వచ్చారు... ఏం కాస్త నోరు తెరిచి డబ్బేమైనా కావాలి అని అడిగితే చచ్చిన వాడి ఆత్మ సంతోషిస్తుంది కదా!' అన్నాడు ఈసడింపుగా.

'నిజమే... వాళ్ళు అడగాలనే అనుకొని వుంటారు గాని... చుట్టూ వున్న మన్ని చూస్తే నోరు పెగిలి వుండదు!' రామారావు గొణిగాడు.

'వెన్నుపోటు పొడిచే వాళ్ల ఇలాగే ఉంటారు' అన్నట్లుగా తిరస్కారంగా ఒకసారి అతడి మొఖంలోకి చూచి గెమాక్సిన్ పాకెట్ చించి శవం చుట్టూ చల్లాడు. అప్పటికే కొన్ని చీమలు అక్కడ తచ్చట్లాడుతున్నాయి. 'వెధవ కంపు' అనుకున్నాడు ఖాళీ పాకెట్‌ను ఓ మూలకు విసిరేస్తూ.

పదకొండు గంటలప్పుడు వాకిట్లో ఆటో ఆగిన చప్పుడయింది. ఒక్కసారిగా నలుగురూ లేచి తలుపు దగ్గరకు వచ్చారు.

శ్రీనివాసు భార్య ఆటో దిగుతోంది. ఆమె వెనకాలే నాలుగేళ్ల ఆమె కొడుకు దిగాడు. డెబ్బై యేళ్ల తండ్రి దిగాడు. జుట్టు నెరిసిన తల్లి దిగింది.

రెండు పెద్దపెద్ద సంచులు పట్టుకొని లోపలకు వస్తున్న వాళ్లకు నలుగురూ తప్పుకొని దారి ఇచ్చారు.

ముసలాయనే ముందుగా నోరు తెరిచాడు. 'మా అల్లుడు ఎలా పోయాడండీ!' అంటూ.

సాంబశివుడు టేపు తిప్పటం మొదలుపెట్టాడు. ఆయన ఆ మాటలు వింటూ రుద్ధకంఠంతో, 'దాన తల పాతికేళ్లకే చెడింది... నా ఖర్మ... ఈ వయస్సులో దానికి ఇలాంటి స్థితి వస్తుందని అనుకోలేదు!' అన్నాడు.

నలుగురు మిత్రులూ ఆయన బాధను చూస్తూ వుండిపోయారు.

లోపలకు వెళ్ళిన శ్రీనివాసు భార్యగాని, అత్తగారి గాని బయటకు రాలేదు.

పావుగంట తరువాత సాంబశివుడే ముసలాయన్ను కదిలించాడు. 'ఇక కార్యక్రమాన్ని మొదలుపెడదామా అండీ!' అంటూ.

'మొదలుపెట్టండి... ఎంతసేపు ఉంచుకున్నా చచ్చిన వాడు బ్రతికి రాలేడు కదా!' అన్నాడు ఉత్తరీయపు అంచుతో మొఖాన్ని అద్దుకుంటూ.

'మరి... మరి బ్రాహ్మణుడిని మాట్లాడాలి... ఆయన్ను ఏం కావాలో కనుక్కొని సామాన్లు తేవాలి... లారీని అద్దెకు పట్టుకు రావాలి!' గొణుగుతున్నట్లుగా సాంబశివుడే అన్నాడు.

'ఇవేవీ తప్పేవి కాదు గదా నాయినా!' ఆయన నిరాసక్తంగా అన్నాడు.

సాంబశివుడికి అరికాలి మంట నెత్తి కెక్కుతోంది ఆయన మాట తీరుకు. జేబులో నుంచి డబ్బులు బయటకు తీస్తే పనులు క్షణాల మీద అయిపోతయి!

'అదేనండి... తప్పదు గదా... ఇలాంటి విషయాల్లో ఖర్చుకు ఓ పరిధి అంటూ లేదు... మనం ఖర్చు పెట్టే దాన్నిబట్టే ఏర్పాట్లు వుంటయి!'

'నిజమే మరి... ఎంతలో చేద్దామని?' ముసలాయన కూతురున్న గదిలోకి వెళ్ళబోతూ అన్నాడు మొఖం వెనక్కు తిప్పి.

'మీ శక్తి మాకెలా తెలుస్తుందండీ!' సాంబశివుడి పళ్లు కరకరమంటున్నయి.

'నా కూతురు మా అల్లుడితో కాపురం చేసిందానికంటే ఆయనగారు మీతో కలిసి తిరిగిన కాలమే ఎక్కువ... మా అల్లుడి శక్తి ఏమిటో మీకే తెలియాలి!'

మూర్తి ఆయన దగ్గరకు వచ్చాడు. 'అది కాదు అంకుల్!... మీరు ఎంత డబ్బు ఖర్చు పెట్టగలరో చెబితే అంతలోనే మేం ఏర్పాట్లు చేస్తాం!' అన్నాడు సూటిగా.

ముసలాయన ఓ నిట్టూర్పు విడిచి కూతురున్న గదిలో కాలుపెట్టాడు.

'వాళ్లు డబ్బు ఎంత ఖర్చు పెడతారు - అంటున్నారు?' అన్నాడు.

శ్రీనివాసు భార్య రెండు నిమిషాలు కళ్లు మూసుకొని వుండిపోయింది. తరువాత గది బయటకి వచ్చింది.

సాంబశివుడు ఆమెను చూస్తూనే ఓ అడుగు వెనక్కు వేశాడు.

ఆయన మాటల్నిబట్టి వాళ్ల డబ్బేం తేలేదని అర్థమయిపోయింది వాళ్ళకు. తెచ్చి వున్నట్లయితే ముసలాయనే చెప్పేసేవాడు. అల్లుడు చచ్చాడని తెలిసింతరువాత ఇన్ని గంటలు వాళ్లు కలిసి ప్రయాణం చేశారు. మాట్లాడుకొని ఉండరా... మళ్ళా కూతుర్ని అడిగేదేమిటి? సాంబశివుడు ఇక ఆలస్యం చేయలేదు.

'డబ్బు కోసరం వర్రీ అవబోకండి... మాకు కాలనీలో చాలామంది తెలిసిన వాళ్లున్నారు... మీరు 'ఊ' అంటే నలుగురినీ అడిగి తీసుకువచ్చి ఖర్చు పెడతాం. అప్పో అలాగే అని కాదు... మీ దగ్గర ఉంటే ఎవర్నీ అడగనక్ఖర్లేదు!

ఆమె వంచుకున్న తలను ఎత్తలేకపోయింది.

'ఎవర్నీ అడగవద్దు!' చాలా చిన్నగా అన్నది. 'ఆయన నా మెళ్లో కట్టిన మంగళసూత్రాలు మిగిలే వున్నాయి... వాటితో ఇంకా పనేమున్నది. అమ్మితే కాస్తో కూస్తో వస్తుంది గదా... అందులోనే ఈ కార్యక్రమం పూర్తి చేద్దాం... ఇంకో గంటలో మా అన్నయ్య రాజమండ్రి నుంచి వస్తున్నాడు. ఆ సంగతేదో వాడు చూస్తాడు కాని - మీరు అనవసరంగా శ్రమపడబోకండి!' అంటూ శవం దగ్గరకు నడిచింది. 'ఆయన బ్రతికున్నంత వరకూ ఈ ఇంటి పరువు ఆయనకు సంబంధించినది... ఆయన పోయింతరువాత శవాన్ని అడ్డుపెట్టుకొని చందాలు వసూలు చేసి నా పరువు నేను పోగొట్టుకోలేను!'

'నిజమేననుకోండి... ఆయనకు కొన్ని అప్పులు కూడా వున్నాయి... కాస్త ఈ వంకన వసూలు చేస్తే ఎవరికీ అన్యాయం చేసి పోయినట్లుగా ఉండదు' సాంబశివుడు ఏడుపు కంఠంతో అన్నాడు.

'ఆయన నాకు ఆస్తి ఏమీ ఇవ్వలేదు... ఇదిగో ఆయన కట్టిన మంగళసూత్రాలు కూడా ఆయన కోసరమే ఉపయోగించేస్తున్నాను... ఏదైనా... అప్పు తీసుకున్నవాళ్లే వాటిని తీర్చాలిగాని మధ్యలో మనం చేయగలిగిందేమున్నది చెప్పండి!' ఆమె చటుక్కున లోపలకు వెళ్ళి తలుపేసేసుకున్నది.

★

'ఆయన నాకు ఆస్తి ఏమీ ఇవ్వలేదు... ఇదిగో ఆయన కట్టిన మంగళసూత్రాలు కూడా ఆయన కోసరమే ఉపయోగించేస్తున్నాను... ఏదైనా... అప్పు తీసుకున్న వాళ్లే వాటిని తీర్చాలిగాని మధ్యలో మనం చేయగలిగిందేమున్నది చెప్పండి!'